

తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఎస్సీ, బీసీ, బలిజ, మైనారిటీ, మహిళా సిటింగు ఎమ్మెల్యేలలో తీవ్ర అలజడి నెలకొంటోంది. అదే సమయంలో ఓ కులానికి చెందిన బలమైన సిటింగు ఎమ్మెల్యేలు మాత్రం నిశ్చింతగా కనిపిస్తున్నారు. అధికార వైసీపీ అధిష్ఠానం తీరుతో తొమ్మిది నియోజకవర్గాల్లో సామాజికంగా వెనుకబడిన వర్గాలు తీవ్ర నిస్పృహకు లోనవుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో టికెట్లు తిరిగి దక్కుతాయో లేదోనని ఈ వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు తీవ్ర ఆందోళన చెందుతుండడం గమనిస్తున్న ఆయా వర్గాలు అధికార పార్టీ అధిష్ఠానంపై మండిపడుతున్నాయి. సిటింగు ఎమ్మెల్యేలకు చెందిన సామాజికవర్గాలను తక్కువగా చూస్తున్నందునే వారికి అవకాశాల పట్ల ఇష్టానుసారంగా ఆడుకుంటున్నారన్న భావనకు సంబంధిత వర్గాలు లోనవుతున్నాయి.

9మంది సిటింగుల్లో అలజడి

- నిశ్చింతగా ప్రాబల్య కులానికి చెందిన నేతలు

సామాజికంగా వెనుకబడిన కులాల నేతలతో వైసీపీ అధిష్ఠానం తీరు ఫలితం



తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో సత్యవేడు, జీడీనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాలు, కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లా పరిధిలోకి చేరిన గూడూరు, సూళ్ళూరుపేట వంటి ఐదు నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వుడుగా వున్నాయి. వీటికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు ఐదుగురూ అధికార పార్టీకి చెందిన వారే. గూడూరులో రిటైర్డు ఐఏఎస్ అధికారి వరప్రసాద్, సూళ్ళూరుపేటలో కిలివేటి సంజీవయ్య, సత్యవేడులో కోనేటి ఆదిమూలం, జీడీనెల్లూరులో కళత్తూరు నారాయణస్వామి, పూతలపట్టులో ఎంఎస్ బాబులలో ఒక్కరంటే ఒక్కరికి కూడా టికెట్‌పై వైసీపీ అధిష్ఠానంనుంచీ స్పష్టమైన హామీ లభించలేదు. ఈ ఐదు చోట్లా అభ్యర్థులను మారుస్తారన్న ప్రచారం జరుగుతూండడంతో దాదాపుగా వీరందరూ తీవ్ర అభద్రతతో వున్నారు. వీరిలో సత్యవేడు, పూతలపట్టు ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చేది లేదని చెప్పేసినట్టు కూడా ప్రచారం జరుగుతోంది. సూళ్ళూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్యకు టికెట్ దక్కడం పట్ల అనుమానం వుండబట్టే ఎంపీ విజయసాయిరెడ్డిని నడిరోడ్డుపై అడ్డగించి అనుచరులతో తనకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేయించారు. ఈ ఐదుగురిలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి సహా ఎవరూ టికెట్ తనకే అని ధైర్యంగా చెప్పలేని పరిస్థితి. మదనపల్లె సిటింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషాకు కూడా టికెట్ లేదని స్పష్టత ఇచ్చినట్టు తెలిసింది. దీంతో ఆయన కూడా నిర్వేదంలో వున్నట్టు సమాచారం. పలమనేరు సిటింగ్ ఎమ్మెల్యే వెంకటే గౌడ బీసీగా పరిగణించబడుతున్న సంగతి తెలిసిందే. అక్కడా ఆయనకు కాకుండా మాజీ మంత్రి అమరనాథరెడ్డిని ఓడించేందుకు బలమైన వ్యక్తిని పోటీ చేయించేందుకు వైసీపీ అధిష్ఠానం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఏకైక బీసీ ఎమ్మెల్యేగా వున్న వెంకటేగౌడ దీంతో నైరాశ్యంలో కూరుకుపోయినట్టు సమాచారం. జిల్లాలో ఏకైక బలిజ ఎమ్మెల్యేగా వున్న చిత్తూరు ఆరణి శ్రీనివాసులుకు కూడా మొండిచేయి చూపారని, అక్కడ ఆయనకు ప్రత్యామ్నాయంగా రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో శ్రీనివాసులు కూడా నిస్పృహతో వున్నట్టు సమాచారం. జిల్లాలో ఏకైక మహిళా ఎమ్మెల్యేగా వున్న మంత్రి రోజా సైతం టికెట్‌పై ధీమాగా లేరు. అక్కడ మార్పు తప్పదన్న సంకేతాలుండడంతో జోరు తగ్గించిన ఆమె తనకు టికెట్ ఇవ్వకపోయినా సీఎం జగన్ కోసం త్యాగం చేసేందుకు సిద్ధమని తగ్గి మాట్లాడుతున్న పరిస్థితి. ఇలా తొమ్మిది నియోజకవర్గాల్లో ఎస్సీ, బీసీ, బలిజ, మైనారిటీ, మహిళ వంటి సామాజికంగా వెనుకబడిన సిటింగు ఎమ్మెల్యేలు అనిశ్చితిలో, అభద్రతతో సతమతమవుతున్నారు.

నిశ్చింతగా బలమైన నేతలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాకు సంబంధించి చూస్తే బలమైన నేతలు టికెట్‌పై నిశ్చింతగా వుండడం కనిపిస్తోంది. వెంకటగిరిలో సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, తిరుపతి సమన్వయ కర్త భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీలేరులో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లెలో ద్వారకనాథ రెడ్డి వంటివారు వచ్చే ఎన్నికలకు ధీమాగా సమాయత్తమవుతున్నారు. వారిలో టికెట్ మార్పు భయం ఏ కోశానా కనిపించడం లేదు. కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ బీసీ అయినప్పటికీ అక్కడ అంతకు మించిన ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఆయన నిక్షేపంగా వుండగలుగుతున్నట్టు సమాచారం. ఈ పరిణామాలు ఈ ప్రాంతాల్లోని సామాజికంగా వెనుకబడిన ఎస్సీ, బీసీ, మైనారిటీ, బలిజ, మహిళా వర్గాలలో అధికార పార్టీ పట్ల తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. టికెట్ దక్కని ఆయా వర్గాల నేతలు కడుపుమండి అధిష్ఠానంపై విమర్శలకు దిగుతుంటే అధిష్ఠానం ఇతర నేతలతో వారిపై ఎదురుదాడి చేయిస్తుండడం ఆయా సామాజిక వర్గాలకు మింగుడు పడడం లేదు. బలహీనవర్గాల సిటింగు ఎమ్మెల్యేల రాజకీయ జీవితాలతో ఆడుకుంటున్న వైనం ఆ వర్గాల్లో ఆగ్రహావేశాలు రగిలిస్తున్నాయి. దీని పర్యవసానం వచ్చే ఎన్నిల్లో అధికార పార్టీపై ప్రతిఫలించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పూతలపట్టు వైసీపీలో సిగపట్లు

- తెరమీదకు మూడో పేరు


డాక్టర్ పూజారి లోకవర్ధన్

తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రిజర్వుడు నియోజకవర్గమైన పూతలపట్టు సీటు ఎవరికి కేటాయించాలనే విషయంలో వైసీపీ అధిష్ఠానం మరో ప్రత్యామ్నాయాన్ని పరిశీలిస్తోంది. పీలేరు నియోజకవర్గం కలికిరి పట్టణానికి చెందిన డాక్టర్ పూజారి లోకవర్ధన్ పేరు ముఖ్యనేతల ద్వారా అధిష్ఠానం దృష్టికి వెళ్ళింది. అక్కడ సిటింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు టికెట్ లేదని అధిష్ఠానం తేల్చి చెప్పేసిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ ప్రత్యామ్నాయంగా తెరమీదకు వచ్చిన సంగతి తెలిసిందే. ఎంఎస్ బాబుకే టికెట్ ఇవ్వాలని ఓ వర్గం కోరుతుండగా ఆయనను పక్కన పెట్టి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్‌కు అవకాశం కల్పించాలని మరో వర్గం విజ్ఞప్తి చేస్తోంది. ఈ అంతరం క్రమేపీ పెరిగిపోయి సునీల్‌కుమార్‌కు టికెట్ ఇస్తే అతడికి సహకరించకూడదని ఎంఎస్ బాబు వర్గం నిర్ణయించుకున్నట్టు సమాచారం. అదే సమయంలో ఒకవేళ తిరిగి ఎంఎస్ బాబుకే గనుక టికెట్ కేటాయిస్తే అతడికి సహకరించరాదని ఆయన్ను వ్యతిరేకిస్తున్న వర్గం భావిస్తున్నట్టు తెలిసింది. ఇద్దరిలో ఎవరికి అవకాశమిచ్చినా ఓ వర్గం పనిచేయదన్న సమాచారం అధిష్ఠానానికి అందినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో అధిష్ఠానం ఇరువురినీ పక్కన పెట్టి అవసరమైతే మూడవ వ్యక్తిని రంగంలోకి దించాలని ఆలోచిస్తున్నట్టు సమాచారం. ఆ క్రమంలోనే కలికిరి పట్టణానికి చెందిన డాక్టర్ లోకవర్ధన్ పేరు అనూహ్యంగా తెరమీదకు వచ్చింది. సీనియర్ వైద్యుడైన ఆయన ప్రస్తుతం అన్నమయ్య జిల్లా వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలతో సన్నిహిత సంబంధాలున్నాయి. దానికి తోడు ఆయన సతీమణి వైసీపీ తరఫున కలికిరి జడ్పీటీసీగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన పేరు అధిష్ఠానానికి వెళ్ళినట్టు చెబుతున్నారు. పూతలపట్టులో పాత కాపుల కంటే కొత్త వారిని బరిలోకి దింపితే వర్గ విభేదాలు, అసంతృప్తులు వంటివి వుండవన్న భావనతో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిధున్ సైతం లోకవర్ధన్ పేరు సూచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. పూతలపట్టు నుంచీ వైసీపీ 2014లో డాక్టర్ సునీల్‌కుమార్‌కు తొలిసారి టికెట్ ఇవ్వగా ఆయన గెలిచారు. 2019లో సునీల్‌కుమార్‌ను పక్కన పెట్టి ఎంఎస్ బాబుకు టికెట్ ఇవ్వగా ఆయనా గెలిచారు. దీంతో కొత్త వారికి టికెట్ ఇస్తే గెలుస్తారన్న అభిప్రాయం ఆ పార్టీ వర్గాల్లోనూ వ్యక్తమవుతోంది. దీంతో రానున్న ఎన్నికల్లో సిటింగును, మాజీ ఎమ్మెల్యేని కాదని కొత్త వ్యక్తిని పోటీకి దింపాలన్న ఈ ప్రయత్నం ఎంతవరకూ సఫలీకృతమవుతుందో, దీనిపట్ల పూతలపట్టు నియోజకవర్గ వైసీపీ నాయకులు, శ్రేణులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సివుంది.

ఎవరికి టికెట్ వచ్చినా గెలిపించుకుందాం

తిరుపతిలో బలిజ ప్రముఖుల సమావేశంలో తీర్మానం

తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈనెలాఖరున భారీ ఎత్తున వనభోజనాలు నిర్వహించాలి... వచ్చే ఎన్నికల్లో సామాజికవర్గం నుంచీ ఎవరికి టికెట్ దక్కినా కలసికట్టుగా గెలిపించుకోవాలి... ఇవీ గురువారం తిరుపతిలో జరిగిన బలిజ ప్రముఖుల సమావేశంలో చేసిన తీర్మానాలు. తిరుపతి ఎన్‌జీవో కాలనీలోని బాస్ (బలిజ అభ్యుదయ సేవా సంఘం) కార్యాలయంలో టీడీపీ నేత ఊకా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బలిజ సామాజికవర్గానికి చెందిన పలువురు ముఖ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏటా నిర్వహించే తీరులోనే ఈ ఏడాది కూడా వనభోజనాలు నిర్వహించే విషయమై తొలుత చర్చించారు. తిరుపతి నగరంతో పాటు చంద్రగిరి, శ్రీకాళహస్తి, జీడీనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్ళపల్లి, పీలేరు, రైల్వే కోడూరు తదితర ప్రాంతాల నుంచీ కూడా భారీ ఎత్తున బలిజ సామాజికవర్గాన్ని వనభోజనాలకు ఆహ్వానించాలని నిర్ణయించారు. కనిష్ఠంగా పది వేల నుంచీ గరిష్ఠంగా పదిహేను వేలమందితో ఘనంగా జరపాలని నిశ్చయించారు. ఎక్కడ నిర్వహించాలన్న దానిపై ఒకటి రెండు స్థలాలు చూశాక నిర్ణయం తీసుకోవాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా ఎన్నికలు రెండు నెలల సమీపానికి వచ్చిన నేపథ్యంలో రాజకీయంగానూ చర్చ జరిగింది. టీడీపీ, జనసేన పార్టీల నడుమ పొత్తు కుదిరిన నేపథ్యంలో ఉమ్మడి అభ్యర్థిగా బలిజల్లో ఎవరికి అవకాశం వచ్చినా అందరూ కలసికట్టుగా గెలిపించుకోవాలన్న ప్రతిపాదన వచ్చిందని, సమావేశానికి హాజరైన ముఖ్యులందరూ ఈ ప్రతిపాదనను మూకుమ్మడిగా ఆమోదించినట్టు తెలిసింది. వైసీపీలో బలిజ సామాజికవర్గానికి ఎమ్మెల్యే టికెట్ అవకాశం లేని నేపథ్యంలో టీడీపీ, జనసేన పార్టీల్లోనే అవకాశాలున్నాయని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడినట్టు సమాచారం. అందువల్లే సమావేశానికి ప్రధానంగా ఆ రెండు పార్టీలకు చెందిన నాయకులు అందరూ హాజరైనట్టు తెలిసింది. రాజకీయపరమైన చర్చలకు, నిర్ణయాలకు సంబంధించి తరచూ సమావేశం కావాలని, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని తీర్మానించుకున్నట్టు తెలిసింది. కాగా సమావేశానికి టీడీపీ నుంచీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఊకా విజయ్‌కుమార్, కోడూరు బాలసుబ్రమణ్యం, జనసేన నుంచీ డాక్టర్ హరిప్రసాద్, కిరణ్ రాయల్, ఎడిఫై స్కూలు కరస్పాండెంట్ ప్రణీత్ తదితరులతో పాటు పలువురు రిటైర్డు ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

సమస్యలు పరిష్కరించమంటే

విధులకు రమ్మంటారా?

- ప్రభుత్వ నోటీసు ప్రతులను దహనం చేసిన అంగన్వాడీలు


తిరుపతిలో ప్రభుత్వ నోటీసు ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు

తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారంతో 24 రోజులకు చేరుకుంది. తిరుపతి సహా జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలున్న చంద్రగిరి, పుత్తూరు, పిచ్చాటూరు, సత్యవేడు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, గూడూరు, వెంకటగిరి, కోట తదితర చోట్ల రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. నాయుడుపేటలో రిలే దీక్షా శిబిరంలో ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు వేపాకులు చేతబట్టుకుని వైసీపీ ప్రభుత్వానికి దెయ్యం పట్టిందని, దెయ్యాన్ని వదిలిస్తామంటూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. తిరుపతి, పిచ్చాటూరు, పుత్తూరుల్లో రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్న ఉద్యోగులకు శుక్రవారం నుంచీ విధులకు హాజరు కావాలంటూ ఆయా సీడీపీవోలు నోటీసులు జారీ చేశారు. అయితే ఆ నోటీసు ప్రతులను తమ శిబిరాల ఎదుట తగులబెట్టిన ఉద్యోగులు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే దాకా విధుల్లో చేరే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. కాగా కోట మండల కేంద్రంలో అంగన్వాడీ ఉద్యోగుల రిలే దీక్షకు చిన్నారులు హాజరై మద్దతు ప్రకటించగా పిచ్చాటూరులో ఉద్యోగులు సోది చెబుతూ నిరసన తెలిపారు. సత్యవేడులో ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే ఆదిమూలాన్ని కలసి అంగన్వాడీ ఉద్యోగులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

చెత్తకుప్పల తొలగింపుపై ఉద్రిక్తత

సూళ్లూరుపేటలో ట్రాక్టర్లను అడ్డుకున్న పారిశుధ్య కార్మికులు

సీఐటీయూ నాయకుల అరెస్టు

సూళ్లూరుపేట, జనవరి 4: సూళ్లూరుపేట పట్టణ వీధుల్లో చెత్తకుప్పల తొలగింపు విషయమై గురువారం తీవ్ర వివాదం నెలకొంది.పారిశుధ్య కార్మికులు 10 రోజులుగా సమ్మె చేస్తుండడంతో మున్సిపాలిటీ పరిధిలో చెత్తకుప్పలు పేరుకుపోయాయి.ఈ నేపథ్యంలో గురువారం ఎంపీపీ అల్లూరు అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు ప్రైవేట్ కూలీలను పెట్టి పురవీధుల్లో చెత్తను తొలగించేందుకు పూనుకున్నారు.ఈ సమాచారం తెలుసుకొన్న పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు ఎర్రజెండాలు చేతపట్టుకొని చెత్తను తరలించే ట్రాక్టర్లను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో కార్మికులు, పోలీసులు, కౌన్సిలర్ల నడుమ తోపులాటలు జరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగప్రవేశం చేసి సీఐటీయూ నాయకులను స్టేషన్‌కు తరలించారు. దీంతో కాసేపు కార్మికుల నిరసనలతో పట్టణ వీధులు హోరెత్తాయి. చివరకు కార్మికులు స్టేషన్‌కు చేరుకొని అరెస్టు చేసిన సీఐటీయూ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు.ఈలోపు ప్రైవేట్ కూలీల చేత వీధుల్లో చెత్తను తొలగించారు.మధ్యాహ్నంపైన సీఐటీయూ నాయకులను పూచీకత్తుపై పోలీసులు పంపించేశారు.


చెత్త తొలగింపును అడ్డుకొంటున్న కార్మికులు

కాంగ్రెస్‌లో ఎవరు చేరినా

మాకు ప్రత్యర్థులే

- వైఎస్ షర్మిలను ఉద్దేశించి మంత్రి పెద్దిరెడ్డి
- ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పార్టీని విమర్శించడం సబబు కాదని వ్యాఖ్య

చిత్తూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్‌లో ఎవరు చేరినా సరే మా రాజకీయ ప్రత్యర్థిగానే చూస్తాం. రాజకీయాల్లో మా కాళ్లను మేమే నరుక్కోం' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరడంపై మీడియా ప్రతినిధులు మంత్రి స్పందనను కోరగా.. ఆయన పైవిధంగా స్పందించారు. చిత్తూరులో గురువారం జరిగిన పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. కాంగ్రెస్‌లోకానీ, టీడీపీలోకానీ తమ పార్టీకి, సీఎం జగన్‌కు వ్యతిరేకంగా పనిచేసేవారిని ప్రతిపక్షంగానే చూస్తామన్నారు. వైసీపీలో దళిత ఎమ్మెల్యేలకు విలువ లేదని, సర్వే పేరుతో టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని, వ్యతిరేకత ఉన్నా ఓసీలకు మళ్లీ సీట్లు ఇస్తున్నారని ఇటీవల పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చేసిన విమర్శలను మంత్రి పెద్దిరెడ్డి వద్ద మీడియా ప్రతినిధులు ప్రస్తావించారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. 'ఎంఎస్ బాబు ఆత్మ విమర్శ చేసుకోవాలి. జడ్పీటీసీగా ఓడిపోయిన వ్యక్తిని ఏ విధంగా తీసుకొచ్చి ఎమ్మెల్యేగా గెలిపించామనేది గుర్తు చేసుకోవాలి. ఇంగితజ్ఞానం లేకుండా ఎవరో చెప్పిన మాటలు విని రెచ్చిపోయి మాట్లాడటం సబబు కాదు. ఇప్పటికైనా ఆయన తప్పు తెలుసుకుని వైసీపీ కోసం పనిచేయాలి' అని పేర్కొన్నారు.



లోయలో పడిన కారు - రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగభూషణం - స్వరూప - గురునాథ్ - సాత్విక

భాకరాపేట లోయలో పడిన కారు

నలుగురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం

చంద్రగిరి, జనవరి 4 : చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్ రోడ్డులో గురువారం రాత్రి ఓ కారు అదుపు తప్పి సుమారు 40 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో నలుగురు గాయాల పాలయ్యారు. పోలీసుల కథనం మేరకు.... ఎర్రావారిపాలెం మండలం ఓఎస్.గొల్లపల్లికి చెందిన నాగభూషణం కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరుకు వెళ్లారు. గురువారం సాయంత్రం కారులో తిరుగుప్రయాణమయ్యారు.రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించడానికి తిరుపతి వస్తుండగా భాకరాపేట ఘాట్ రోడ్డులో కారు అదుపు తప్పి సుమారు 40 అడుగుల లోతుగల లోయలో పడిపోయింది.కారులో ప్రయాణిస్తున్న నాగభూషణం, ఆయన భార్య స్వరూప, కుమారుడు గురునాథ్, కుమార్తె సాత్విక గాయపడ్డారు. క్షతగాత్రులు లోయలో ఆర్తనాదాలు పెడుతుండగా ఆ దారిలో వెళ్ళే వాహన చోదకులు గుర్తించి 108అంబులెన్సుకు సమాచారం అందించారు. వాహన చోదకుల సాయంతో 108 సిబ్బంది లోయలోకి దిగి క్షతగాత్రులను పైకి తీసి, చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.క్షతగాత్రుల్లో నాగభూషణం పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దామలచెరువులో గడప గడపకు..



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న మోహిత్ రెడ్డి

పాకాల, జనవరి 4: పాకాల మండలం దామలచెరువు పంచాయతీలో గురువారం తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గడప గడపకు మహాపాదయాత్ర నిర్వహించారు. బజారు వీధి, మౌలాలిపేట, మ్యాంగోనగర్, ఆజాద్‌నగర్‌లలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. దామలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది పనితీరుపై ప్రజలు ఫిర్యాదు చేశారు. జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేసి నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆనందగిరి హుండీ ఆదాయం రూ.2.29లక్షలు



పాకాల, జనవరి 4: మండలంలోని ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వళ్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ హుండీ కానుకలను గురువారం లెక్కించారు. అక్టోబరు 17వ తేదీ నుంచి గురువారం వరకు భక్తులు హుండీలో కానుకల రూపంలో రూ.2,29,569 సమర్పించారు. ఆలయ ఛైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి, కార్యనిర్వహణ అధికారి యువరాణి, దేవదాయ శాఖ తనిఖీ దారుడు ఫణీరాజశయన, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో మంత్రులు

తిరుచానూరు, జనవరి 4: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని గురువారం ఇద్దరు మంత్రులు దర్శించుకున్నారు. ఉదయం రాష్ట్రమంత్రి ఉషశ్రీ చరణ్, రాత్రి బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఏఈవో రమేష్, సూపరింటెండెంట్లు శేషగిరి, శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌లు ప్రసాద్, గణేస్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణస్వామికి తిరువీధి ఉత్సవం



తిరుచ్చిపై ఊరేగుతున్న సూర్యనారాయణస్వామి

తిరుచానూరు, జనవరి 4: తిరుచానూరులో కొలువైన సూర్యనారాయణస్వామికి గురువారం సాయంత్రం తిరుచ్చి ఉత్సవం వేడుకగా జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం హస్తాను పురస్కరించుకుని ఆలయంలో విశేషా పూజాది కార్యక్రమాలుజరిగాయి. సాయంత్రం సర్వాలంకార శోభితుడైన స్వామివారు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీతి, నిజాయితీకి పట్టంకట్టండి



వృద్ధురాలికి అభివాదం చేస్తున్న సుధారెడ్డి

చంద్రగిరి, జనవరి 4: నీతి, నిజాయితీ, నిబద్ధత గల చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానికి ఒక్క అవకాశం కల్పించాలని తెలుగు మహిళా నేత పులివర్తి సుధారెడ్డి అన్నారు. గురువారం నరసింగాపురంలో మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. పులివర్తి నానితోనే అవినీతి రహిత పాలన సాధ్యమవుతుందన్నారు. ఓటమి భయంతో దొడ్డిదారిలో అందలం ఎక్కాలని ఎమ్మెల్యే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా దొంగ ఓట్లు నమోదయ్యాయని, ఆరు నెలలుగా పోరాటం చేస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నాలుగున్నర ఏళ్లలో గుర్తుకురాని నిరుద్యోగులు, ఎన్నికల సమయంలో జాబ్ మేళా పేరుతో మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అనంతరం టీడీపీ పాలనలో నిర్మించిన స్వయం సహాయక ఉపాధి కేంద్రాన్ని సందర్శించి, హర్షం వ్యక్తం చేశారు.

నాలుగు దశాబ్దాలుగా..

సైకిల్‌పై తిరుమల యాత్ర



శక్తిదాసన్

చంద్రగిరి, జనవరి 4: తమిళనాడుకు చెందిన శక్తిదాసన్(61) అనే వ్యక్తి దాదాపు నాలుగు దశాబ్దాలుగా సైకిల్‌పైనే తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకుని వెళుతున్నాడు. గురువారం తిరుగుప్రయాణంలో జాతీయ రహదారిలోని చంద్రగిరి వద్ద ఉన్న నాగాలమ్మను దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. 'నాది తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు జిల్లా కినత్తుకడవు, సింగరామ్ పాళ్యం. ఈ ఏడాది కూడా స్వగ్రామం నుంచి సైకిల్‌పై మంగళవారం రాత్రికి తిరుపతికి చేరుకున్నాను. బుధవారం వేకువజామున తిరుమలకు కాలినడకన వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నాను. గురువారం ఉదయం తిరుచానూరు అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యాను. నాలుగు దశాబ్దాలుగా దాదాపు నాలుగు వందల కిలోమీటర్ల దూరం సైకిల్‌పైనే వచ్చి శ్రీవారిని దర్శించుకుంటున్నా' అని శక్తిదాసన్ తెలిపారు.

వైసీపీకి ఇక 100 రోజులే

పులివర్తి నాని



కార్మిక చైతన్య బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పులివర్తి నాని

తిరుపతి రూరల్, జనవరి 4: వైసీపీ ప్రభుత్వ పతనం దగ్గర పడిందని, ఇక వంద రోజులు మాత్రమే అధికారంలో ఉంటోందని టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని విమర్శించారు. అవిలాల పంచాయతీలో గురువారం ఆయన పర్యటించారు. ఎక్కడ చూసినా రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్య కనిపిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో 80 శాతం ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి దొంగోట్లు సృష్టించి, గెలవాలని చూస్తున్నారని అన్నారు. వాటికి సంబంధించిన ఆధారాలు సేకరించి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, కోర్టును కూడా ఆశ్రయిస్తామని అన్నారు. అనంతరం ఈనెల 6 నుంచి టీడీపీ నిర్వహించే కార్మిక చైతన్య బస్సు యాత్ర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నేత మధు, నాయకులు పాల్గొన్నారు.

మా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

దివ్యాంగుల ఆవేదన



అన్నదానం చేస్తున్న దివ్యాంగులు

చంద్రగిరి, జనవరి 4: తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందని మునీశ్వర స్వామి దివ్యాంగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించి, అన్నదానం చేశారు. ఈసందర్భంగా మణికంఠ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి దివ్యాంగుడికీ ప్రభుత్వం స్థలాన్ని కేటాయించి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షులు ఉషారాణి, జిల్లా కార్యదర్శి పూజ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె




చంద్రగిరిలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

చంద్రగిరి, జనవరి 4: ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ముందు అంగన్వాడీలు చేస్తున్న సమ్మె గురువారంతో 24వ రోజుకు చేరుకుంది. వారు మాట్లాడుతూ సీఎం జగన్ తమకు ఇచ్చిన మాట తప్పారని విమర్శించారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ, విజయకుమారి, నాగభూషణమ్మ, లీలా, నాగరాజమ్మ, పద్మిని, సుజాత పాల్గొన్నారు.

నకిలీ బిల్లులతో మాయాజాలం

నిధుల వ్యయంలో చేతివాటం ● ఇందిరానగర్ పంచాయతీలో లీలలు



2018 బిల్లు | 2022 బిల్లు

వరదయ్యపాళెం, జనవరి 4: వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ పంచాయతీలో గత ఏడేళ్ల నుంచీ వీధి దీపాలు, నీటి మోటార్ల రిపేర్, ఎలక్ట్రికల్ మెటీరియల్స్ కొనుగోలు తదితరాలకు సంబంధించి పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరదయ్యపాళెంలోని రెండు హార్డ్‌వేర్ దుకాణాల పేరు మీద నకిలీ బిల్లులను సృష్టించి నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఇందిరానగర్ పంచాయతీలో 2016 నుంచి 2023 వరకు నిర్వహించిన వార్షిక లావాదేవీల్లో నిధుల దుర్వినియోగం జరిగినట్లు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఆడిపూడి ఆషా దరఖాస్తు చేసుకున్న సమాచార హక్కుచట్టం ద్వారా ఇటీవల వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఆమె తెలిపిన వివరాల మేరకు...... 2016-2017 ఆర్థిక సంవత్సరానికి గాను పట్టణంలోని రెండు హార్డ్‌వేర్ దుకాణాలలో ఎలక్ట్రికల్ వస్తువుల కొనుగోలుకు సంబంధించి రూ.2,04,475 చెల్లించినట్లు రికార్డుల్లో చూపారు. అదేవిధంగా 2018-19 లో రూ.98,202, 2019-20లో రూ.2,31,055 ఒకసారి, రూ.1,88,304 మరోసారి చెల్లింపులు జరిగినట్లు చూపారు. 2020-21లో రూ.2,03,020, 2021-22లో రూ.2,73,722 పంచాయతీ నిధుల నుంచి బిల్లులు చెల్లించినట్లు రికార్డులు చూపారు.వీటికి సరైన ఆధారాలు లేకుండా దొంగ బిల్లులతో నిధులు స్వాహా చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇదే విషయమై సదరు సామాజిక కార్యకర్త దుకాణ యజమానుల వద్ద విచారించగా ఈ బిల్లులకు తమకు ఎలాంటి సంబంధంలేదని, కొన్నింటిని మాత్రమే ఇచ్చామని, మిగిలిన వాటికి తమకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. ఇదిలా ఉండగా 2017-18 ఆర్థిక సంవత్సరంలో జరిగిన నిధుల వ్యయానికి సంబంధించి అసలు రికార్డులే లేకపోవడం గమనార్హం.

జీఎస్టీకే ఎసరు

2018 నుంచి దేశవ్యాప్తంగా జీఎస్టీ అములులోకి వచ్చినా కూడా ఈ పంచాయతీలో టిన్‌నెంబర్‌తోనే అధికారులు చెల్లింపులు జరపడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఆ టిన్ నెంబర్లు కూడా నెలవారీగా సీరియల్‌గా లేకుండా జిగ్‌జాగ్ పద్ధతిలో ముందు వెనుకకు ఉండడం విస్మయం కలిగిస్తోంది. ఉదాహరణకు 2017 జనవరిలో కొనుగోలు చేసిన బిల్లులకు టిన్‌నెంబర్ 1931, 1906 ఉంటే అదే ఏడాది మార్చిలో జరిగిన చెల్లింపులకు టిన్‌నెంబర్ 1701 ఉండడం గమనార్హం.

నిధుల్లో చేరకముందే తీర్మానం ఆమోదం?

ఇందిరానగర్ పంచాయతీలో 2022 మార్చి 2న విధుల్లోకి చేరిన ఓ అధికారి ఏడాది ముందు అంటే 2021 అక్టోబరులో జరిగిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఆయన అధ్యక్షతన పంచాయతీ ఆమోద తీర్మానం జరిగినట్లు సంతకం చేయడం విస్తుగొలుపుతోంది.అసలు ఇందిరానగర్ పంచాయతీలోనే ఇన్ని అవకతవకలు ఎలా జరిగాయి? ఎవరి ప్రోద్బలంతో జరిగాయి? ఉన్నతాధికారులు విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని అవినీతి జరిగి ఉంటే ఆ సొమ్మును తిరిగి పంచాయతీకి చేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

షర్మిల పార్టీలో చేరినందుకు కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



మున్సిపల్ కార్యాలయం కూడలిలో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), తిరుపతి అర్బన్, జనవరి 4 : సీఎం జగన్ సోదరి, వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ శ్రేణులు నగరంలో సంబరాలు జరుపుకున్నాయి. గురువారం ఢిల్లీలో సోనియాగాంధీని కలిసిన షర్మిళ తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనంచేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం కూడలిలో షర్మిల చిత్రమున్న బ్యానర్‌ను పట్టుకుని, టపాసులుపేల్చి ఆనందం వ్యక్తం చేశారు. షర్మిళకు పార్టీలోకి ఆహ్వానం పలుకుతున్నట్టు చెప్పారు. అలాగే పీసీసీ ప్రధాన కార్యదర్శి గౌడపేర చిట్టిబాబు ఆధ్వర్యంలో అలిపిరి వద్ద ఆ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్ ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవాన్ని చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వై.సుబ్రహ్మణ్యం, సోమశేఖర్, ధనంజయ్, సత్యమూర్తి, వెంకటరామయ్య, యువజన జిల్లా విభాగం అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్, వెంకటరామయ్య పాల్గొన్నారు.

జయహో బీసీలో తిరుపతి నేతలు



తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధినేత నారా చంద్రబాబు ఆధ్వర్యంలో విజయవాడ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో తిరుపతి జిల్లా నుంచి పెద్దఎత్తున బీసీ నాయకులు పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం బీసీలను చైతన్యవంతం చేస్తామని నేతలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జయహో బీసీ వాహనాలను ప్రారంభించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, బీసీ వర్గాల అధ్యక్షుడు కొల్లు రవీంద్ర, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్, బీసీ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం, బీసీ నేతలు మునస్వామి యాదవ్, జగన్నాథం, కిరణ్ యాదవ్, వెంకటకృష్ణయ్య, దశరథాచారి, గురవా రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రుద్రకోటి సదాశివం అచ్చెన్నాయుడును శాలువాతో సత్కరించి, శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

మహాప్రస్థానం నిర్వాహకులకు మెమో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి సిటీ, జనవరి 4 : రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన వారి మృతదేహాలను ఉచితంగా తీసుకువెళ్లాల్సిన మహాప్రస్థానం వాహనాల నిర్వాహకులకు గురువారం ఏఆర్ఎంవో హరికృష్ణ మెమో జారీ చేశారు. మహాప్రస్థానం వాహనాలు కదలకపోవడంతో ప్రైవేటు అంబులెన్సుల నిర్వాహకుల హవా పెరిగిపోతున్న విషయంపై రెండు రోజులుగా ఆంధ్రజ్యోతిలో వస్తున్న కథనాలకు ఆయన స్పందించి ఈ విషయంపై గురువారం పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. మహాప్రస్థానం వాహనాల నిర్వాహకులను పిలిచి గట్టిగా మందలించడంతో పాటు మెమో జారీ చేశారు. ఆస్పత్రిలో మృతిచెందిన ప్రతి ఒక్కరి మృతదేహాలను తప్పక తీసుకువెళ్లాలని, అలాగే వారి నుంచి నగదు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలా మరోసారి జరిగితే ఫిర్యాదు రాసి డీఎంఈకు సరెండర్ చేస్తామని స్పష్టం చేశారు.

ఫొటో ఎక్స్‌పో పోస్టరు ఆవిష్కరణ

తిరుపతి (రవాణా), జనవరి 4 : తిరుపతి తిరుమల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27, 28వ తేదీలలో నిర్వహించే ఫొటో ఎక్స్‌పో పోస్టరును గురువారం ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమలో అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రాజ్, సభ్యులు అమర్‌నాథ్, రాధాకృష్ణ, సురేష్, శరత్, రాజు, సునీల్, బాలాజీరావు, పురంధర్, రహంతుల్లా, హరి,హేమంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

16వ రోజుకు ఎస్ఎస్ ఉద్యోగుల సమ్మె

● ఎస్టీయూ, యూటీఎఫ్ సంఘాల మద్దతు

తిరుపతి(విద్య), జనవరి 4 : కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం 16వ రోజుకు చేరుకుంది. ఉద్యోగులకు ఎస్టీయూ(ఆర్‌సీపురం), యూటీఎఫ్(తిరుపతి అర్బన్)సంఘాల నాయకులు మద్దతు తెలిపి, సంఘీభావం ప్రకటించారు. తమ వంతుగా రూ.12వేల నగదును విరాళంగా అందించారు. ఉద్యోగులు మాట్లాడుతూ తమను రెగ్యులరైజ్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని, సకాలంలో జీతాలు అందించాలని కోరారు. ఈ సమ్మెలో 34 మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎస్వీయూ వీసీ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 4: మంత్రి బొత్సా సత్యనారాయణను ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి కలిశారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి మంత్రిని కలిసి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని వీసీ శ్రీకాంత్‌రెడ్డి కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

నేడు పరమహంస యోగానంద 131వ జయంత్యుత్సవం

తిరుపతి (కల్చరల్), జనవరి 4 : పరమహంస యోగానంద జయంత్యుత్సవం తిరుపతిలో శుక్రవారం నిర్వహించనున్నారు. యోగదా సత్సంగ ధ్యాన మండలి ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు కపిలతీర్థం రోడ్డులోని మలయాళ సద్గురు సమాజం వేదికగా జరగనున్న వేడుకలకు అందరూ హాజరు కావాలని యోగదా సత్సంగ ధ్యానమండలి కోరింది.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



తిరుపతి(విద్య),జనవరి4: శివజ్యోతినగర్‌లోని ప్రభుత్వ అంధుల శరణాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు, దివ్యాంగులు కలసి లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పుష్పాంజలితో నివాళి అర్పించి పాలాభిషేకం చేశారు. అంధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. నాయకులు పాడి బండ మురళి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, అక్కిపల్లి మునికృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

7న యువతకు సాంస్కృతిక పోటీలు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 4: వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే యువజనోత్సవాలలో భాగంగా పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 7న యువతకు సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు సెట్విన్ సీఈవో మురళీకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జానపద నృత్యం, ఫోక్‌సాంగ్ పోటీలలో పాల్గొనేందుకు 16 నుంచి 29 సంవత్సరాల వయస్సు గలవారు అర్హులని పేర్కొన్నారు. విజేతలకు ఈ నెల 12న జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తారని, మరిన్ని వివరాల కోసం 0877-2286921, 9848543976 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న న్యాయవాదుల ఆందోళన

తిరుపతి(లీగల్), జనవరి 4: ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌కు నిరసనగా న్యాయవాదులు చేపట్టిన ఆందోళన 32 రోజులుగా కొనసాగుతోంది. తిరుపతి బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు జి.వెంకటకుమార్ అధ్యక్షతన గురువారం జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈనెల 22వ తేదీవరకు న్యాయవాదులు కోర్టులకు హాజరుకాకూడదని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గోపిచంద్, సహాయ కార్యదర్శి గాలి మధు, సీనియర్ న్యాయవాదులు కంచి ప్రకాశం, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ



తిరుపతి(విద్య),జనవరి4: బైరాగిపట్టెడలోని ఎంజీఎం హైస్కూల్‌లో పదవ తరగతి చదివే విద్యార్థులకు ఎన్నారై చంద్రమోహన్ ఆర్థిక సౌజన్యంతో గురువారం రూ.35వేల విలువైన స్టడీ మెటీరియల్ వితరణ చేశారు. ముఖ్య అతిథిగా వచ్చిన కార్పొరేటర్ తూకివాకం శాలిని మహేష్‌రెడ్డి విద్యార్థులకు మెటీరియల్‌ని అందించి మాట్లాడారు. కష్టపడి, ఇష్టపడి చదివి రాబోవు టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. తక్కువ సమయంలో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలు ఆచరించాలని తెలిపారు. హెచ్ఎం మురుగన్, టీచర్లు బండి మధుసూదన్‌రెడ్డి, ఎం.మునిశారద, వై.హేమాద్రిబాబు, కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందులిచ్చే నాథులేరి?



మందుల కోసం నిరీక్షిస్తున్న రోగులు

తిరుపతి సిటీ, జనవరి 4 : మందులు ఇచ్చే నాథులు లేక రుయాస్పత్రి ప్రధాన ఫార్మసీ విభాగం ముందు రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి గురువారం చోటుచేసుకుంది. సాధారణంగా రుయాస్పత్రిలో ఉదయం నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఓపీ సేవలు కొనసాగుతాయి. వైద్యుల వద్ద చూపించుకుని వారు రాసిచ్చే మందుల కోసం వచ్చేలోపు రోగులకు గంట సమయం పడుతుంది. ఈ లోపు ఫార్మసీల్లోని సిబ్బంది భోజన సమయం అని తలుపులు మూసేస్తున్నారు. దీంతో వైద్యం పొందిన రోగులు మందుల కోసం దాదాపు 3 గంటల వరకు వేచి ఉండాల్సి వస్తోంది. ఇటువంటి పరిస్థితులు ఎదురవకూడదనే ప్రతి ఫార్మసీలోనూ ఇద్దరు నుంచి ఆరుగురు వరకు ఫార్మసిస్టులు అందుబాటులో ఉండాలని, ఒకరు భోజనానికి వెళితే మరొకరు రోగులకు మందులు ఇవ్వాలని అధికారుల ఆదేశాలున్నాయి. కానీ పర్యవేక్షణ లోపం కారణంగా రోగుల బాధలు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. దీంతో అసలే రోగంతో బాధపడే వారితో పాటు వృద్ధులు సైతం గంటల తరబడి ఫార్మసీల ముందు నిరీక్షించలేక గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆ మందులను బయట కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. దీనిపై అధికారులు దృష్టి సారించాలని రోగులు కోరుతున్నారు.

దేవర, గేమ్‌చేంజర్ సినిమాల్లో నటిస్తున్నా

సినీనటుడు శ్రీకాంత్



తిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్ దేవర, రామ్‌చరణ్ గేమ్‌చేంజర్ చిత్రాల్లో నటిస్తున్నానని ప్రముఖ సినీనటుడు శ్రీకాంత్ తెలిపారు. గురువారం ఉదయం ఆయన తన సతీమణి ఊహ, కుమారుడు హీరో రోషన్, కుమార్తె మేధ, చిన్న కుమారుడు రోహన్‌తో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం శ్రీకాంత్ మీడియాతో మాట్లాడుతూ నూతన ఏడాది సందర్భంగా కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీ అన్నారు. హీరో రోషన్ మీడియాతో మాట్లాడుతూ ఛాంపియన్ అనే చిత్రంలో నటిస్తున్నానని, డిసెంబరులో ఆ చిత్రం విడుదలవుతుందని వెల్లడించారు. కాగా, ఆలయం ముందు శ్రీకాంత్ కుటుంబాన్ని చూడటానికి సినీ అభిమానులు ఉత్సాహం చూపారు. వారితో సెల్ఫీలు తీసుకున్నారు.

ఉద్యోగులందరూ సమానమే



మాట్లాడుతున్న ఈడీ కోటేశ్వరరావు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 4 : ఆర్టీసీ ఉద్యోగులందరూ సమానమేనని, సమష్టిగా పనిచేస్తే ప్రయాణికులకు మెరుగైన సేవలందించగలుగుతామని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. తిరుపతి పర్యటనకు వచ్చిన ఆయన గురువారం ప్రజారవాణాధికారి కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. కక్ష సాధింపు, ఆధిపత్య పోరు వద్దని, సిబ్బంది ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రద్దీకనుగుణంగా బస్సులు నడిపి సంస్థకు ఆదాయం సమకూర్చాలన్నారు. డిపోలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కడప జోన్ ఇన్‌చార్జ్ ఈడీ చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, సీఎంఈ నరసింహులు, పీవో పార్థసారథి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడాకారులకు సన్మానం



తిరుపతి(కొర్లగుంట), జనవరి 4 : జాతీయ స్థాయి క్రీడల్లో ప్రాతినిథ్యం వహించిన జిల్లా క్రీడాకారులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈనెల 3న ఢిల్లీలో జరిగిన అండర్ 19 స్కూల్‌గేమ్స్ స్విమ్మింగ్ పోటీలలో తిరుపతికి చెందిన రాగుల హితేష్, అలాగే గత నెల ఉత్తర ప్రదేశ్ నోయిడాలో జరిగిన సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన కె.శోభ ప్రాతినిథ్యం వహించారు. వారిని జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు వై.ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్, జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ అభినందించారు. స్విమ్మింగ్, బాక్సింగ్ కోచ్‌లు ఆది, కైలాష్, విజయమోహన్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ పూజిత అక్షింతల పంపిణీ



తిరుపతి(కొర్లగుంట), జనవరి 4 : అయోధ్యలో ఈనెల 22న రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం స్థానిక నెహ్రూనగర్‌లో శ్రీరామ పూజిత అక్షింతలు, రామమందిర చిత్రపటం, ఆహ్వానపత్రికలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నగర కార్యదర్శి రమేష్, పనుగంటి భాస్కరరావు, గుండాల గోపినాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంయాదవ్, కట్టమంచి చంద్రబాబుయాదవ్, కీర్తి, వెంకయ్య, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు

తిరుమల, జనవరి4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 65,514 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,394 మంది తలనీలాలు సమర్పించారు.

నేడు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : తిరుమల అన్నమయ్య భవన్‌లో శుక్రవారం డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డితో నేరుగా మాట్లాడవచ్చు. దీనికోసం 0877 2263261 నంబరును సంప్రదించాల్సి ఉంటుంది.

నేటితో ముగియనున్న అధ్యయనోత్సవాలు

తిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. డిసెంబరు 12న వైకుంఠ ఏకాదశికి 11 రోజుల ముందు ఈ ఉత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. స్వామి ప్రాశస్త్యంపై 12 మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను శ్రీవైష్ణవ జీయంగార్లు ప్రతిరోజూ గోష్ఠిగానం ద్వారా స్వామికి నివేదిస్తున్నారు. ఈ 25 రోజుల్లో ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4 వేల పాశురాలను శ్రీవైష్ణవులు స్వామి ఆలయంలోని రంగనాయక మండపంలో పారాయణం చేశారు. అధ్యయనోత్సవాల్లో తొలి 11 రోజులను పగల్‌పత్తు అని, మిగిలిన 10 రోజులను రాపత్తు అని వ్యవహరిస్తారు. కాగా, 22వ రోజున కణ్ణినున్ శిరుత్తాంబు, 23వ రోజున రామానుజ నూత్రందాది జరిగాయి. 24వ రోజైన గురువారం వరాహస్వామి ఆలయంలో సాత్తుమొర నిర్వహించారు. 25వ రోజు శుక్రవారం తణ్ణీరముదు ఉత్సవంతో ఈ అధ్యయనోత్సవాలు ముగుస్తాయి.

వెంకన్న సేవలో ప్రముఖులు



గోపినాథ్ - రోహిణి సింధూరి

తిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపినాథ్, ఐఏఎస్ అధికారి రోహిణి సింధూరి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

నేడు, రేపు కల్యాణి డ్యామ్ నీటికి అంతరాయం

తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : తిరుపతికి నీటి సరఫరా చేసే కల్యాణి డ్యాం పైపులైన్ మెయింటెనెన్స్‌లో భాగంగా శ్రీనివాస మంగాపురం రైల్వే క్రాసింగ్‌లో కొత్తగా వేసిన గ్రావిటీ పైపులైనుకు ఇంటర్ కనెక్షన్ చేపట్టనున్నందున నగరంలోని పలు డివిజన్లలో శుక్ర, శని వారాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలగనుందని కమిషనర్ హరిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25, 28, 32, 36, 38, 30, 34, 35, 36, 38, 27, 21 డివిజన్లలో నీటి సరఫరా అత్యవసరమైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. అవసరమైన వారు 9849906680, 9949095227, 9849983061, 9618888019 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

చీకటి జీవోలకు భయపడం

● అంగన్వాడీల హెచ్చరిక

తిరుపతి (రవాణా), జనవరి 4: సమ్మె విరమించి విధుల్లోకి రాకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన చీకటి జీవోలకు భయపడేది లేదని అంగన్వాడీలు హెచ్చరించారు. కలెక్టర్ల ద్వారా సీడీపీవో, సూపర్‌వైజర్లు దీక్షా శిబిరం వద్దకు వచ్చి అంగన్వాడీలకు జీవోలను అందించగా వాటిని గురువారం దగ్ధం చేశారు. సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి కెవేణుగోపాల్, అంగన్వాడీ తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజమ్మ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించినా స్పందించలేదని, అందుకే సమ్మెలోకి వెళ్లామని తెలిపారు. సమ్మె సమయంలో ఐదుసార్లు చర్చలకు పిలిచి బెదిరింపులకు పూనుకోవడం సరికాదన్నారు. కంటితుడుపు చర్యలు కాదని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని అన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, మినీలను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు బుజ్జి, తంజావూరు మురళి, వాసు, అంగన్వాడీలు జయప్రభ, సుజిత, వరలక్ష్మి, ఎల్లమ్మ, గీత, శాంతి, గంగాదేవి, సుశీల, గోమతి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోయింది

టీటీపీ జిల్లా కార్యదర్శి యశ్వంత్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 4: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోయిందని, సీఎంగా మళ్లీ చంద్రబాబును చూడాలని ఆశగా ఎదురుచూస్తున్నారని టీడీపీ జిల్లా కార్యదర్శి యశ్వంత్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజలను మోసం చేశారన్నారు. నాడు గ్రాఫిక్స్ అని విమర్శలు చేసిన వైసీపీ అదే రాజధానిలో కూర్చుని పరిపాలన చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీకి గుడ్‌బై చెబుతున్నారని అన్నారు. మరో మూడు నెలల్లో కొత్త ప్రభుత్వం కొలువుదీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరాఆమయ్య, మురళీధర్, చెంగయ్య, వేణుగోపాల్, రవిశంకర్‌యాదవ్, గిరీష్‌కుమార్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ వజ్రోత్సవాలను విజయవంతం చేయండి



డీఈవో శేఖర్‌తో కలసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

తిరుపతి(విద్య), జనవరి 4 : కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించే ఎస్టీయూ వజ్రోత్సవాలకు జిల్లాలో ఎక్కువ సంఖ్యలో టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి భీమినేని మునికృష్ణనాయుడు పిలుపునిచ్చారు. సంఘ ఆధ్వర్యంలో రూపొందించిన వజ్రోత్సవ పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం డీఈవో డాక్టర్ వి.శేఖర్‌తో కలసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 75వసంతాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించే ఈ వజ్రోత్సవాల్లో భాగంగా 12న ఉదయం 10 గంటలకు ధర్నాచౌక్ నుంచి 5వేల మంది టీచర్లతో భారీ ఊరేగింపు ఉంటుందన్నారు. డీఈవో శేఖర్ మాట్లాడుతూ టీచర్లు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. నాయకులు జగన్నాథం, వేణుగోపాల్, సుధాకర్, దేవేంద్ర, మురళీకృష్ణ, రమేష్‌నాయక్, శివ, హరిబాబు, వాసు, రామాంజనేయులు, మనోహర్, గిరి, మధుసూదనరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ డాక్టర్ శిరీష

ఘనంగా అంధుల దినోత్సవం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 4: లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని ఏపీ ఎన్జీవో హోమ్‌లో గురువారం జాతీయ అంధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ అంధుల సమాఖ్య(ఎన్ఎఫ్‌బీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖాధికారి శ్రీనివాసన్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వికలాంగుల సమస్యలను తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. జాతీయ అంధుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి రామసుబ్బయ్య మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీచేయలేదని తెలిపారు. ఎన్ఎఫ్‌బీ సమన్వయకర్త డి.విజయశేఖర్‌రెడ్డి సంఘం ప్రగతి నివేదికను, ఎనిమిదేళ్లుగా సాధించిన విజయాలను, చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం జాతీయ అంధుల సమాఖ్య తిరుపతి శాఖ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్‌రావు, ధనుంజయరెడ్డి, రమణమ్మ, బాబుగౌడ్, నాగరాజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు శ్రీవారి ప్రసాదాలు



తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో బహిరంగ సభ జరిగింది. ఈ సభకు హాజరైన టీడీపీ అధినేత నారా చంద్రబాబును వేదికపై పంచాయితీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య కలిసి శాలువాతో సత్కరించి, శ్రీవారి ప్రసాదాలు అందజేశారు.

నగదు తీసుకున్న ఎఫ్ఎన్‌వోకు మెమో

తిరుపతి సిటీ, జనవరి 4 : మృతదేహాన్ని స్ట్రెచ్చర్‌పై తీసుకువచ్చినందుకు బాధితుల నుంచి నగదు తీసుకున్న ఎఫ్ఎన్‌వోకు సీఎస్ఆర్ఎంవో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

లక్ష్మానాయక్ గురువారం మెమో జారీ చేశారు. రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన వారి మృతదేహాలను స్ట్రెచ్చర్‌పై తీసుకువచ్చి అంబులెన్సులో ఎక్కించేందుకు బాధితుల నుంచి సిబ్బంది నగదు వసూలు చేస్తున్న విషయమై గురువారం చేయి తడపనిదే స్ట్రెచ్చర్ కదలదు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన సీఎస్ఆర్ఎంవో లక్ష్మానాయక్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్ ఈ విషయంపై విచారణ చేపట్టారు. ఎఫ్ఎన్‌వోను పిలిపించి విచారించగా ఆమె నగదు తీసుకున్నట్లు అంగీకరించింది. ఆమెకు తక్షణమే మెమో జారీ చేయడంతో పాటు మరోసారి ఇలా చేస్తే ఇంటిదోవ తప్పదని హెచ్చరించారు. సిబ్బంది ఎవరైనా నగదు అడిగితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

మందులిచ్చే నాథులేరీ?



రుయాస్పత్రిలో మందుల కోసం నిరీక్షిస్తున్న రోగులు

తిరుపతి సిటీ, జనవరి 4: మందులు ఇచ్చే నాథులు లేక రుయాస్పత్రి ప్రధాన ఫార్మసీ విభాగం ముందు రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి గురువారం చోటుచేసుకుంది. సాధారణంగా రుయాస్పత్రిలో ఉదయం నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఓపీ సేవలు కొనసాగుతాయి. వైద్యుల వద్ద చూపించుకుని వారు రాసిచ్చే మందుల కోసం వచ్చే లోపు రోగులకు గంట సమయం పడుతుంది. ఈ లోపు ఫార్మసీల్లోని సిబ్బంది భోజన సమయం అని తలుపులు మూసేస్తున్నారు. దీంతో వైద్యం పొందిన రోగులు మందుల కోసం దాదాపు 3 గంటల వరకు వేచి ఉండాల్సి వస్తోంది. ఇటువంటి పరిస్థితులు ఎదురవకూడదనే ప్రతి ఫార్మసీలోనూ ఇద్దరు నుంచి ఆరుగురు వరకు ఫార్మసిస్టులు అందుబాటులో ఉండాలని, ఒకరు భోజనానికి వెళితే మరొకరు రోగులకు మందులు ఇవ్వాలని అధికారుల ఆదేశాలున్నాయి. కానీ పర్యవేక్షణ లోపం కారణంగా రోగుల బాధలు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. దీంతో అసలే రోగంతో బాధపడే వారితో పాటు వృద్ధులు సైతం గంటల తరబడి ఫార్మసీల ముందు నిరీక్షించలేక గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆ మందులను బయట కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. దీనిపై అధికారులు దృష్టి సారించాలని రోగులు కోరుతున్నారు.

నేటితో ముగియనున్న అధ్యయనోత్సవాలు

తిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. డిసెంబరు 12న వైకుంఠ ఏకాదశికి 11 రోజుల ముందు ఈ ఉత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. స్వామి ప్రాశస్త్యంపై 12 మంది ఆళ్వార్లు రచించిన దివ్య ప్రబంధ పాశురాలను శ్రీవైష్ణవ జీయంగార్లు ప్రతిరోజూ గోష్టిగానం ద్వారా స్వామికి నివేదిస్తున్నారు. ఈ 25 రోజుల్లో ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4 వేల పాశురాలను శ్రీవైష్ణవులు స్వామి ఆలయంలోని రంగనాయక మండపంలో పారాయణం చేశారు. అధ్యయనోత్సవాల్లో తొలి 11 రోజులను పగల్‌పత్తు అని, మిగిలిన 10 రోజులను రాపత్తు అని వ్యవహరిస్తారు. కాగా, 22వ రోజున కణ్ణినున్ శిరుత్తాంబు, 23వ రోజున రామానుజ నూత్రందాది జరిగాయి. 24వ రోజైన గురువారం వరాహస్వామి ఆలయంలో సాత్తుమొర నిర్వహించారు. 25వ రోజు శుక్రవారం తణ్ణీరముదు ఉత్సవంతో ఈ అధ్యయనోత్సవాలు ముగుస్తాయి.

ఆటో ఢీకొని సైక్లిస్టు మృతి

గూడూరు, జనవరి 4: ఆటో ఢీకొనడంతో సైక్లిస్టు వ్యక్తి మృతి చెందిన సంఘటన పోటుపాళెం జాతీయ రహదారి సమీపంలోని చిల్లకూరు వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. చిల్లకూరుకు చెందిన ముత్యాలయ్య(49) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. గురువారం పనులకు వెళ్లేందుకు సైకిల్‌పై బయలుదేరాడు. పోటుపాళెం జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా చిల్లకూరుకు చెందిన గోపి ఆటోలో వెళ్తూ అదుపుతప్పి సైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ముత్యాలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు

తిరుమల, జనవరి4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 65,514 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

నేడు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల అన్నమయ్య భవన్‌లో శుక్రవారం డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డితో నేరుగా మాట్లాడవచ్చు. దీనికోసం 0877 2263261 నంబరును సంప్రదించాల్సి ఉంటుంది.

వాగివేడువాసిపై మద్యం కేసు

ఏర్పేడు, జనవరి 4: ఏర్పేడు-వెంకటగిరి మార్గంలో 20 మద్యం సీసాలు తీసుకెళుతున్న శ్రీకాళహస్తి మండలం వాగివేడు గ్రామానికి చెందిన వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జిలానీ తెలిపారు.


కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఏర్పేడు, జనవరి 4:వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ నాయకులు ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. కుక్కలగుంట, గుడిమల్లం గ్రామాల్లో బీజేపీ నాయకులు పర్యటించారు.

నకిలీ బిల్లులతో మాయాజాలం

నిధుల వ్యయంలో చేతివాటం ● ఇందిరానగర్ పంచాయతీలో లీలలు

వరదయ్యపాళెం, జనవరి 4: వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ పంచాయతీలో గత ఏడేళ్ల నుంచీ వీధి దీపాలు, నీటి మోటార్ల రిపేర్, ఎలక్ట్రికల్ మెటీరియల్స్ కొనుగోలు తదితరాలకు సంబంధించి పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరదయ్యపాళెంలోని రెండు హార్డ్‌వేర్ దుకాణాల పేరు మీద నకిలీ బిల్లులను సృష్టించి నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఇందిరానగర్ పంచాయతీలో 2016 నుంచి 2023 వరకు నిర్వహించిన వార్షిక లావాదేవీల్లో నిధుల దుర్వినియోగం జరిగినట్లు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఆడిపూడి ఆషా దరఖాస్తు చేసుకున్న సమాచార హక్కుచట్టం ద్వారా ఇటీవల వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఆమె తెలిపిన వివరాల మేరకు...... 2016-2017 ఆర్థిక సంవత్సరానికి గాను పట్టణంలోని రెండు హార్డ్‌వేర్ దుకాణాలలో ఎలక్ట్రికల్ వస్తువుల కొనుగోలుకు సంబంధించి రూ.2,04,475 చెల్లించినట్లు రికార్డుల్లో చూపారు. అదేవిధంగా 2018-19 లో రూ.98,202, 2019-20లో రూ.2,31,055 ఒకసారి, రూ.1,88,304 మరోసారి చెల్లింపులు జరిగినట్లు చూపారు. 2020-21లో రూ.2,03,020, 2021-22లో రూ.2,73,722 పంచాయతీ నిధుల నుంచి బిల్లులు చెల్లించినట్లు రికార్డులు చూపారు.వీటికి సరైన ఆధారాలు లేకుండా దొంగ బిల్లులతో నిధులు స్వాహా చేశారన్న



2018 బిల్లు 2022 బిల్లు

ఆరోపణలు వస్తున్నాయి. ఇదే విషయమై సదరు సామాజిక కార్యకర్త దుకాణ యజమానుల వద్ద విచారించగా ఈ బిల్లులకు తమకు ఎలాంటి సంబంధంలేదని, కొన్నింటిని మాత్రమే ఇచ్చామని, మిగిలిన వాటికి తమకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. ఇదిలా ఉండగా 2017-18 ఆర్థిక సంవత్సరంలో జరిగిన నిధుల వ్యయానికి సంబంధించి అసలు రికార్డులే లేకపోవడం గమనార్హం.

జీఎస్టీకే ఎసరు

2018 నుంచి దేశవ్యాప్తంగా జీఎస్టీ అమలులోకి వచ్చినా కూడా ఈ పంచాయతీలో టిన్‌నెంబర్‌తోనే అధికారులు చెల్లింపులు జరపడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఆ టిన్ నెంబర్లు కూడా నెలవారీగా సీరియల్‌గా లేకుండా జిగ్‌జాగ్ పద్ధతిలో ముందు వెనుకకు ఉండడం విస్మయం కలిగిస్తోంది. ఉదాహరణకు 2017 జనవరిలో కొనుగోలు చేసిన బిల్లులకు టిన్‌నెంబర్ 1931, 1906 ఉంటే అదే ఏడాది మార్చిలో జరిగిన చెల్లింపులకు టిన్‌నెంబర్ 1701 ఉండడం గమనార్హం.

విధుల్లో చేరకముందే తీర్మానం ఆమోదం?

ఇందిరానగర్ పంచాయతీలో 2022 మార్చి 2న విధుల్లోకి చేరిన ఓ అధికారి ఏడాది ముందు అంటే 2021 అక్టోబరులో జరిగిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఆయన అధ్యక్షతన పంచాయతీ ఆమోద తీర్మానం జరిగినట్లు సంతకం చేయడం విస్తుగొలుపుతోంది.అసలు ఇందిరానర్ పంచాయతీలోనే ఇన్ని అవకతవకలు ఎలా జరిగాయి? ఎవరి ప్రోద్బలంతో జరిగాయి? ఉన్నతాధికారులు విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని అవినీతి జరిగి ఉంటే ఆ సొమ్మును తిరిగి పంచాయతీకి చేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

దేవర, గేమ్‌చేంజర్ సినిమాల్లో నటిస్తున్నా: శ్రీకాంత్

తిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్ దేవర, రామ్‌చరణ్ గేమ్‌చేంజర్ చిత్రాల్లో నటిస్తున్నానని ప్రముఖ సినీనటుడు శ్రీకాంత్ తెలిపారు. గురువారం ఉదయం ఆయన తన సతీమణి ఊహ, కుమారుడు హీరో రోషన్, కుమార్తె మేధ, చిన్న కుమారుడు రోహన్‌తో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం శ్రీకాంత్ మీడియాతో మాట్లాడుతూ నూతన ఏడాది సందర్భంగా కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీ అన్నారు. హీరో రోషన్ మీడియాతో మాట్లాడుతూ ఛాంపియన్ అనే చిత్రంలో నటిస్తున్నానని, డిసెంబరులో ఆ చిత్రం విడుదలవుతుందని వెల్లడించారు. కాగా, ఆలయం ముందు శ్రీకాంత్ కుటుంబాన్ని చూడటానికి సినీ అభిమానులు ఉత్సాహం చూపారు. వారితో సెల్ఫీలు తీసుకున్నారు.



కుటుంబ సభ్యులతో శ్రీకాంత్

మీ బెదిరింపులకు తలొగ్గం



నోటీసులను తగలబెడుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

పుత్తూరు అర్బన్, జనవరి 4: తమ డిమాండ్లు పరిష్కరించే వరకు విధులకు హాజరుకాబోమని, బెదిరిస్తే తలొగ్గే ప్రసక్తే లేదని అంగన్వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు రిలే నిరాహార దీక్ష చేశారు. ఇదే సమయంలో పుత్తూరు సీడీపీవో కసిరెడ్డి పద్మజారెడ్డి దీక్షా శిబిరానికి చేరుకుని అంగన్వాడీ కార్యకర్తలకు నోటీసులు అందించారు. ప్రభుత్వ సూచనల మేరకు శుక్రవారం నుంచి అంగన్వాడీ కార్యకర్తలు విధులకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. లేకుంటే శాఖాపరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో వివరించారు. దీనిపై సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి వెంకటేష్ భగ్గుమన్నారు. ఏళ్ల తరబడి సమస్యలను పరిష్కరించకుండా తాత్సారం చేస్తున్న ప్రభుత్వం నిరసన తెలుపుతున్న కార్మికులపై ఉక్కుపాదం మోపాలని చూడడం గర్హనీయమన్నారు. అధికారులు అంగన్వాడీ కార్యకర్తలపై బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తే సహించబోమన్నారు. చేతనైతే అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించాలే తప్ప బెదిరింపులకు పాల్పడితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డిమాండ్లు పరిష్కరిస్తేనే విధులకు హాజరవుతామని అంగన్వాడీ కార్యకర్తలు తేల్చి చెప్పారు. అనంతరం సీడీపీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధికారులు ఇచ్చిన నోటీసులను తగలబెట్టి నిరసనను తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు మునికుమారి, విజయకుమారి, కృష్ణవేణి, ధనమ్మ, రాధా, పద్మజ, లలిత, హైమావతి, అరుణ, గంగులమ్మ, అన్నపూర్ణ, మోహనలక్ష్మీ, ప్రమీల, దళిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే ప్రజలకు భవిష్యత్తు గ్యారంటీ



భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో డాక్టర్ హెలిన్

నారాయణవనం, జనవరి 4: చంద్రబాబునాయుడు పాలనతోనే ప్రజల భవిష్యత్తు గ్యారెంటీ ఉంటుందని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ హెలిన్ పేర్కొన్నారు. నారాయణవనం మండల పరిధిలోని పాలమంగళంలో తెలుగు యువత అధ్యక్షుడు నరేష్, యూనిట్ ఇన్‌చార్జి బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హెలిన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి జాడ కనపడడంలేదన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలంటే రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, విజయ్, చరణ్, లోకేష్, దినేష్, సంతోష్, షైఖిల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నారాయణవనం పంచాయతీలో టీడీపీ మండలాధ్యక్షుడు గిరిబాబు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. నాయకులు షణ్ముగం, కేఎస్ రవి, తిరువెంగడం, టైలర్ బాబు, శరవణ, రమేష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పుత్తూరు టౌన్, జనవరి 4: మండల పరిధిలోని పిళ్లారుపట్టులో ఉన్న పాలిటెక్నిక్‌లో ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ అసోసియేషన్ (ఏపీ సాంకేతిక విద్యాశాఖ ఉద్యోగుల సంఘం) క్యాలెండర్‌ను అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనందరావు, ప్రిన్సిపాల్ ఎస్‌పీ.కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఏవో హనుమంతురావు, సుబ్రహ్మణ్యం, గుణవర్ధన్, వికాష్, ప్రసాద్‌రావు, నాగరాజు, రాజేంద్ర, బాలకృష్ణ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ కుమార్

పుత్తూరు వార్తలు

పింఛన్ల పంపిణీ

పుత్తూరు, జనవరి 4: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్లను మంత్రి రోజా గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పుత్తూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి, చైర్మన్ హరి, మైనారిటీ ఫైనాన్స్ కమిటీ డైరెక్టరు మాహీన్, కౌన్సిలర్లు జయప్రకాష్, శంకర్, నరసింహారావు, ఏకాంబరం, భానుమతి, జయలక్ష్మి, కుప్పమ్మ, హేమ వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కైలాసనాథ కోన హుండీ ఆదాయం రూ.99,196



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

నారాయణవనం, జనవరి 4: మండల పరిధిలోని కామాక్షీదేవి సమేత కైలాసనాధుని ఆలయ హుండీని గురువారం ఈవో కృష్ణనాయక్, ఆలయ పాలక మండలి సమక్షంతో లెక్కించారు. రూ.99,196 ఆదాయం వచ్చినట్లు ఆలయాధికారి కృష్ణ నాయక్, పాలకమండలి చైర్మన్ సుబ్రహ్మణ్యం యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, ఉప సర్పంచు మురళి, అర్చకులు మహేంద్ర శర్మ, సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం

నారాయణవనం, జనవరి 4: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సముదాయం గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో నేలతల్లితో పాటు పంట దిగుబడి అధికంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం, సర్పంచు సుబ్రహ్మణ్యం రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ హేమచంద్రారెడ్డి, సురేష్, మురళీ, నీలమ్మ, సుహాసిని, నిరోషా రైతులు పాల్గొన్నారు.

మీ చెత్త...మీ బాధ్యత

పుత్తూరు అర్బన్, జనవరి 4: మున్సిపల్ కార్మికులు సమ్మెలో ఉన్న నేపథ్యంలో చెత్త సేకరణకు ప్రతిష్టంభన నెలకొందని మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి తెలిపారు. గృహ యజమానులు, వ్యాపార సంస్థల్లో పోగయ్యే రోజువారి చెత్తను బహిరంగంగా ఎక్కడపడితే అక్కడ పారబోయవద్దని సూచించారు. ఇళ్లలోనే చెత్త డబ్బాల్లో పోగేసి ఉంచాలన్నారు. కార్మికులు విధుల్లోకి వచ్చిన తరువాత చేత్త సేకరణను పునఃప్రారంభిస్తామని చెప్పారు. అప్పటి వరకు పట్టణవాసులు సహకరించాలని కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులతో కమిషనర్ చర్చించారు. పట్టణంలో పారిశుధ్య సమస్యను అధిగమించేందుకు సహకరించాలని కోరగా, రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు తాము సమ్మెలో ఉన్నామని విధులకు హాజరుకాలేమని స్పష్టం చేశారు.

ఇది నయవంచన ప్రభుత్వం: భానుప్రకాష్



నేషనూరు పంచాయతీలో ప్రచారం నిర్వహిస్తున్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 4: వైసీపీది నయవంచన ప్రభుత్వమని టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ధ్వజమెత్తారు. గురువారం మండల పరిధిలోని నేషనూరు పంచాయతీలో మీ ఇంటికి మీ తెలుగుదేశం, బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల పేరు చెప్పి అరచేతిలో వైకుంఠం చూపించిన జగన్ అధికారంలోకి వచ్చాక గతంలో ఉన్న పథకాలకే కొత్త పేర్లు పెట్టి అమలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపెచ్చు నిబంధనలను సాకుగా చూపి అర్హులకు మొండిచెయ్యి చూపారని మండిపడ్డారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో ఎనిమిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ప్రభుత్వంగా జగన్ సర్కార్‌ను గిన్నిస్ బుక్‌లో నమోదు చేయాలని ఎద్దేవా చేశారు. వంటనూనె, బియ్యం మొదలుకుని పప్పుదినుసులు ఆఖరికి ఉప్పు ధరలు కూడా పెరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా సొంత లాభం చూసుకోవడం తప్ప ఏ వర్గానికైనా న్యాయం చేశారా అని నిలదీశారు. జాబ్ క్యాలెండర్ ఏమైందని ప్రశ్నించారు. ఐదేళ్లలో కనీసం ఒక్క డీఎస్సీ కూడా వేయని దద్దమ్మ ప్రభుత్వం జగన్ సర్కారేనని స్పష్టం చేశారు. ఒకవైపు కరువు, మరోవైపు తుపాన్లుతో రైతులు తీవ్రంగా నష్టపోతే అధికారులతో సమీక్షించి రైతాంగాన్ని ఆదుకోవాలనే చిత్తశుద్ధి లేని మంత్రులు రాష్ట్రంలో ఉండడం దౌర్భాగ్యమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు వ్యాపారాలు చేసుకోవడానికి తప్ప ప్రజాసేవకు పనికిరారని ఆయన తేల్చి చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటేస్తే సర్వస్వం దోచుకుంటారని ఆయన హెచ్చరించారు. మళ్లీ రాష్ట్రం గాడిలో పడాలన్నా, ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన జీవనం గడపాలన్నా చంద్రబాబునాయుడు పాలన రావాల్సిందేనని చెప్పారు. ప్రతి వ్యక్తి, ప్రతి కుటుంబానికి అండగా ఉండాలనే సంకల్పంతో చంద్రబాబునాయుడు ఆరు గ్యారెంటీలను ప్రకటించారని, దీని ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి కనీసం రూ.లక్ష పైగానే లబ్ధి సమకూరనుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు, టీడీపీకి మద్దతుగా ఉండాలని పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, మండల అధ్యక్షుడు రవికుమార్, కరుణా యాదవ్, మోహన్, గట్టు శివ, వెంకటేష్, సుబ్బు, కోట గజపతి, బాలకృష్ణారెడ్డి, పాండురంగయ్య, విజయ్‌కుమార్, జ్యోతమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఇచ్చిన హామీలను సీఎం జగన్ నిలబెట్టుకోవాలి



మోకాళ్లపై నిలబడి నిరశన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పుత్తూరు అర్బన్, జనవరి 4: గత ఎన్నికల సందర్భంగా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను సీఎం జగన్ నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ పట్టణ గౌరవాధ్యక్షుడు డి.మహేష్ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను విన్నాను.. నేను ఉన్నాను అని గత ఎన్నికల సందర్భంగా మున్సిపల్ కార్మికుల సమస్యలపై భరోసా ఇచ్చిన జగన్ నాలుగున్నరేళ్లు అవుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం, గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల క్రమబద్ధీకరణ, హెల్త్ అలవెన్స్ పెంపు, మహిళా కార్మికులకు ప్రసూతి సెలవుల మంజూరు, కార్మికులు విధివశాత్తు మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి మానవతా ధృక్పథంతో ఉద్యోగం, కార్మికులపై రాజకీయ నాయకుల పెత్తనం లేకుండా చేయడం తదితర డిమాండ్లను నెరవేర్చాలని పట్టుబట్టారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు. నిరశనలో భాగంగా మోకాళ్లపై కూర్చుని నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో అంకయ్య, యాకోబ్, విజయ్‌కుమార్, ప్రభాకర్, గోవిందస్వామి, ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ గణేష్, కోమలి, జయంతి, మునెయ్య, ఏఐటీయూసీ నాయకులు రమేష్, సెల్వరాజ్ ఆచ్చారి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులంటే మంత్రి రోజాకు ఎందుకంత భయం?



సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఏఐటీయూసీ నేత మహేష్ ఇళ్ల వద్ద పోలీసులు

పుత్తూరు అర్బన్, జనవరి 4: మంత్రి రోజాకు కార్మికులంటే ఎందుకంత భయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఏఐటీయూసీ పట్టణ గౌరవాధ్యక్షుడు మహేష్ ప్రశ్నించారు. గురువారం పింఛన్ల పెంపు కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి పుత్తూరులో పర్యటించారు. దీముందు జాగ్రత్త చర్యగా వెంకటేష్, మహేష్‌ను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు. మంత్రి పర్యటన ముగించుకుని వెళ్లేవరకు వారిని గడప దాటనీయలేదు. అలాగే అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరాల వద్ద భారీగా పోలీసులను మొహరించారు. దీనిపై కార్మిక నాయకులు వెంకటేష్, మహేష్ స్పందిస్తూ ప్రజాస్వామ్యంలో డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతిఒక్కరికీ ఉంటుందని స్పష్టం చేశారు. అయితే మంత్రి రోజా పర్యటన సందర్భగా తమను అక్రమంగా నిర్బంధించడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వానికి, మంత్రులకు కార్మికులు చేస్తున్న సమ్మె పట్ల భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నాళ్లు పోలీసులను కాపలాగా పెట్టుకుని పర్యటిస్తారని నిలదీశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కార్మిక వర్గాల డిమాండ్ల పట్ల సానుకూల నిర్ణయం వెలువరించకుంటే మరో రెండు నెలల్లో రానున్న ఎన్నికల్లో సత్తా చూపుతామని హెచ్చరించారు.

ఘనంగా అశోకరాజు జన్మదిన వేడుకలు



అశోకరాజుకు జ్ఞాపిక అందజేస్తున్న అధ్యాపకులు

నారాయణవనం, జనవరి 3: మండలంలో ఉన్న సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ కొండూరు అశోకరాజు జన్మదిన వేడుకలను కళాశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ముగ్గులు వేసి, అశోకరాజుకు పూర్ణకుంభ స్వాగతాలు పలికారు. అనంతరం బ్రాహ్మణుల ఆశీర్వాదంతో కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులు, అధ్యాపకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలను జరపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ముగ్గులు, క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సుబ్బరాజు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి, జనార్దన రాజు, రమేష్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్టీయూ వజ్రోత్సవాలను విజయవంతం చేయండి

తిరుపతి(విద్య), జనవరి 4 : కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించే ఎస్టీయూ వజ్రోత్సవాలకు జిల్లాలో ఎక్కువ సంఖ్యలో టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి భీమినేని మునికృష్ణనాయుడు పిలుపునిచ్చారు. సంఘ ఆధ్వర్యంలో రూపొందించిన వజ్రోత్సవ పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం డీఈవో డాక్టర్ వి.శేఖర్‌తో కలసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 75వసంతాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించే ఈ వజ్రోత్సవాల్లో భాగంగా 12న ఉదయం 10 గంటలకు ధర్నాచౌక్ నుంచి 5వేల మంది టీచర్లతో భారీ ఊరేగింపు ఉంటుందన్నారు. డీఈవో శేఖర్ మాట్లాడుతూ టీచర్లు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. నాయకులు జగన్నాథం, వేణుగోపాల్, సుధాకర్, దేవేంద్ర, మురళీకృష్ణ, రమేష్‌నాయక్, శివ, హరిబాబు, వాసు, రామాంజనేయులు, మనోహర్, గిరి తదితరులు పాల్గొన్నారు.



డీఈవో శేఖర్‌తో కలసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

జయహో బీసీలో ముదిరాజ్ నాయకులు

వడమాలపేట, జనవరి 4: వెనుకబడిన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా టీడీపీ చేపట్టిన జయహో బీసీ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ సాధికారత సంఘ నాయకులు పాల్గొన్నారు. గురువారం మంగళగిరిలో రాష్ట్ర టీడీపీ కార్యాలయంలో జరిగిన బీసీల సాధికారత సమావేశంలో రాష్ట్ర ముదిరాజ్ సాధికారిక అధ్యక్షుడు కేఎల్.రావ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ ముదిరాజ్ బీసీ సాధికారిక కమిటీ కన్వీనర్ ఉమాపతిరావు తదితరులు పాల్గొన్నారు.



జయహో బీసీ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకులు

సమస్యలు తీరేవరకు సమ్మె వీడేది లేదు



రిలే దీక్ష చేస్తున్న అంగన్వాడీలు

శ్రీకాళహస్తి, జనవరి 4: తమ సమస్యలు తిరేవరకు సమ్మెను వీడేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఐసీడీఎస్ కేంద్రం వద్ద గురువారం కూడా సమ్మెను కొనసాగించారు. ఇందులో భాగంగా రిలే దీక్ష చేపట్టారు.ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు.

ఎమ్మెల్యేకి వినతిపత్రం



సత్యవేడు, జనవరి 4: వేతనాలు పెంచి న్యాయం చేయాలని కోరుతూ 24 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోని సీఎం జగన్‌కు మీరైనా చెప్పండని అంగన్వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యే ఆదిమూలానికి వినతిపత్రం అందించారు. సత్యవేడు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే తిరిగి వెళుతుండగా అక్కడే సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు ఆయన కారును ఆపి వినతిపత్రం అందించారు.సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు నిర్మల, శాంతి, ఇందిర, ఝాన్సీ, భారతి, కాంతమ్మ, సుభాషిణి, దివ్య, గౌరి, మంజుల, అనూష, అనిల, భువన, రజని, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నోటీసుల దహనం



పిచ్చాటూరు, జనవరి 4: పిచ్చాటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద గురువారం కూడా అంగన్వాడీల సమ్మె కొనసాగింది. సమ్మె విరమించి విధులకు వెళ్లాలని ఇచ్చిన నోటీసులను దహనం చేస్తూ ప్రభుత్వానికి తమ నిరసనను వ్యక్తపరచారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు ఇందిర సోదమ్మ వేషధారణలో ప్రభుత్వ తీరును ఎండగట్టారు.బీఎస్పీ నాయకుడు ధన అంగన్వాడీలకు సంఘీభావం తెలిపారు. మండల బీఎస్పీ అధ్యక్షుడు రూబెన్ రూ.2 వేలు సహాయం అందజేశారు.

ప్రభుత్వ బెదిరింపులకు భయపడం



రేణిగుంట, జనవరి 4 :అంగన్వాడీలను ప్రభుత్వం బెదిరించాలని చూస్తే భయపడబోరని సీపీఎం జిల్లా కార్యదర్శి వి. నాగరాజు హెచ్చరించారు. గురువారం రేణిగుంటలో సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను గంటలోపు పరిష్కరించే పరిస్థితి ఉన్నా 24 రోజుల వరకు సాగదీయడం అన్యాయమన్నారు.ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ధనమ్మ, భాగ్యలక్ష్మి, అంబిక, ప్రభావతి, పార్వతి, ధరణి తదితరులు పాల్గొన్నారు.

శివనామ పారాయణానికి అవకాశం కల్పించండి

● శోభాయాత్రలో జానపద, భజన కళాకారుల డిమాండు





శివనామ స్మరణచేస్తున్న జానపద కళాకారులు - సమావేశంలో మాట్లాడుతున్న విజయ శంకర స్వామి

శ్రీకాళహస్తి, జనవరి 4: పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి ఆధ్యాత్మికధామంలో అఖండ శివ నామ పారాయణం చేసేందుకు స్థానిక జానపద, భజన బృందాలకు అవకాశం కల్పించాలని కోరుతూ కళాకారులు కదం తొక్కారు. జానపద వృత్తి కళాకారుల సంఘం, అన్నమయ్య కళా క్షేత్రం ఆధ్వర్యంలో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి గురువారం శ్రీకాళహస్తికి భారీగా తరలివచ్చారు. స్వర్ణముఖి నది వద్ద నుంచి ముక్కంటి ఆలయ పరిపాలనా భవనం వరకూ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం త్రినేత్ర అతిథి గృహం వద్ద సభ నిర్వహించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకరస్వామి మాట్లాడుతూ... హిందూ సనాతన ధర్మాన్ని స్థానికంగా ఉన్న జానపద, భజన కళాకారులు క్షేత్రస్థాయిలో చాటి చెబుతున్నారని తెలిపారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో పెద్దఎత్తున జానపద, భజన బృందాలు ఉన్నాయన్నారు.అయితే టీటీడీ తరహాలో శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి కళాకారులకు తగిన ప్రాధాన్యత, గుర్తింపు దక్కడం లేదని వాపోయారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ ఆలయాల్లో నిత్య అఖండ పారాయణం జరుగుతోందని, రూ.100 కోట్లు వార్షిక ఆదాయమున్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో అఖండ పారాయణం జరగకపోవడం విచారకరమన్నారు.సభకు హాజరైన ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ సంక్రాంతి అనంతరం శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్థానిక జానపద, భజన కళాకారులకు అఖండ శివనామ స్మరణ పారాయణం చేసుకునే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో సైతం ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. శ్రీపాద చాయ మఠాధిపతి శ్రీపతి , కాశీనాయన ఆశ్రమ పీఠాధిపతి ఆంజనేయులు, జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు మురళి, తిరుపతి జిల్లా కన్వీనర్ సంక్రాంతి వెంకటయ్య, కార్యదర్శి గెడి వేణు, రవికుమార్, రాజేంద్ర నాయుడు, వెంకటరమణ, నాగరాజు, శంకర స్వామి, వెంకయ్య, విక్రమ్, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఎల్లుండి ఆశా వర్కర్ల సదస్సు

శ్రీకాళహస్తి జనవరి 4: ఈనెల 7వ తేదీన తిరుపతిలో జరిగే ఆశా కార్మికుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆశా కార్మికులకు గురువారం జిల్లా సదస్సుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయిస్తామని వెల్లడించారు. తిరుపతిలోని బైరాగి పట్టెడలో వున్న గంధమనేని శివయ్య భవన్లో జరిగే సదస్సుకు అందరూ తరలి రావాలని కోరారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, ఏఐటీయూసీ నాయకులు శివకుమార్, మణి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ప్రేమ, సుమతి, మమతా, రాణి, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ఇద్దరు వలంటీర్లు

● వైసీపీని వీడిన 50 కుటుంబాలు



శ్రీకాళహస్తి జనవరి 4: ఇద్దరు వలంటీర్లతో సహా వైసీపీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. శ్రీకాళహస్తి 23వ వార్డు పరిధిలో గురువారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.వలంటీర్లు సుబ్రమణ్యం, పద్మావతి వైసీపీ విధానాలు నచ్చక పార్టీని వీడారు.సుమారు 150మంది వైసీపీ కార్యకర్తలు అభిమానులు వారి బాటలోనే టీడీపీలో చేరారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్, యూనిట్ ఇన్‌చార్జి, వినయ్, భూతి ఇంచార్జి, వజ్రం, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

108లో డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

శ్రీకాళహస్తి జనవరి 4 : 108 అత్యవసర వాహనంలో డ్రైవర్ ఉద్యోగాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో కోరారు.తిరుపతి,శ్రీకాళహస్తి తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట, వడమాలపేట, సూళ్లూరుపేట, చిట్టమూరు మండలాల్లో డ్రైవర్ స్థానాలు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. పదవ తరగతి ఉత్తీర్ణత పొంది.. హెవీ డ్రైవింగు లైసెన్స్ కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 7032382246 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ది స్కూల్ విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి జనవరి 4:సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ది స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి రెండవ లెవెల్‌కు అర్హత సాధించారు. గురువారం పాఠశాల కరస్పాండెంటు జనార్దనరావు పవార్ వారిని అభినందించారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి జనవరి 4: ముక్కంటి ఆలయంలో వెలసిన గురుదక్షిణామూర్తి స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా కలశస్థాపన చేసి భక్తుల నుంచి సంకల్ప పూజలు చేశారు. వివిధ ద్రవ్యాలతో అభిషేకించారు.విభూదితో అలంకరించాక పసుపు వర్ణ పూలు, ముడి సెనగల దండలను భక్తులు సమర్పించారు. వేదమంత్రాల మధ్య ధూప దీప నైవేద్యాలను సమర్పించారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

రేణిగుంట, జనవరి 4 : స్థానిక పాంచాలి నగర్‌లో నివాసముంటున్న ఎం. వెంకటరమణ(37)అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడని రేణిగుంట అర్బన్ పోలీసులు తెలిపారు. సదుం ప్రాంతానికి చెందిన ఎం. వెంకటరమణ నాలుగు సంవత్సరాల క్రితం భార్యా పిల్లలతో రేణిగుంటకు వలస వచ్చాడు. పాంచాలీ నగర్‌లో హోమియోక్లినిక్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. క్లినిక్ సరిగా నడవకపోవడంతో కుటుంబ నిర్వహణకోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక బుధవారం రాత్రి ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

ఏర్పేడు, జనవరి 4: ఏర్పేడు మండలం పాగాలి పంచాయతీ కృష్ణంపల్లికి చెందిన చలపతి కుటుంబంపై అదే గ్రామానికి చెందిన శ్రీహరిరెడ్డి, గురుమూర్తిరెడ్డి బుధవారం రాత్రి దాడి చేశారు. దీంతో గురుమూర్తిరెడ్డి, శ్రీహరిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.కృష్ణంపల్లి దళితవాడకు సంబంధించి పూర్వీకుల నుంచి వాడుకుంటున్న గ్రామకంఠం భూమిని గురుమూర్తిరెడ్డి, శ్రీహరిరెడ్డి ఆక్రమించుకుని వాడుకుంటున్నారు.ఆ భూమిని వదలిపెట్టాలని కృష్ణంపల్లి దళితులు చలపతి ఆధ్వర్యంలో రెండు నెలల క్రితం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి చలపతి కుటుంబానికి గురుమూర్తిరెడ్డి, శ్రీహరిరెడ్డి కుటుంబాలకు పడేది కాదు. . ఈ క్రమంలో బుధవారం సాయంత్రం మళ్లీ వివాదం తలెత్తింది.గురుమూర్తి రెడ్డి, శ్రీహరిరెడ్డి ఈ సందర్భంగా చలపతిపై దాడి చేశారు. కుమారుడిని కొడుతున్నారని తెలిసి చలపతి తల్లి చెంగమ్మ అడ్డుకోబోయి తోపులాటలో కిందపడిపోయింది.చెంగమ్మ ఫిర్యాదు మేరకు గురుమూర్తిరెడ్డి, శ్రీహరిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పెన్షన్ల పంపిణీ

సత్యవేడు, జనవరి 4: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పెన్షన్లను ఎమ్మెల్యే ఆదిమూలం పంపిణీ చేశారు.ఎంపీడీవో చంద్రశేఖర్ , జడ్పీటీసీ విజయలక్ష్మి, సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ ఏఎంసీ బాలాజీరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి, ఎంఈవో ఉష, ఉపాధిహామీ ఏపీవో కృష్ణయ్య, వెలుగు ఏపీఎం స్వర్ణలత, పంచాయతీ సెక్రటరీ ముని రవికుమార్, ఎంపీటీసీ బాలయ్య, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సోమశేఖర్, శ్యాంప్రసాద్‌రెడ్డి, గోవింద స్వామి, సర్పంచ్‌లు రవిరెడ్డి, రూబెన్, శేఖర్ పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

రేణిగుంట, జనవరి 4 : రేణిగుంట మండలం నక్కల కాలనీలో మద్యం విక్రయిస్తుండగా దాడులు నిర్వహించి 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని గాజుల మండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు. ఎస్. షాకీర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

వెల్‌నెస్ కేంద్రాల సందర్శన

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 4: మండలంలోని గాజులపెళ్ళూరు, ఆలత్తూరు సచివాలయ పరిధిలో వున్న వెల్‌నెస్ కేంద్రాలను గురువారం జిల్లా వైద్య ప్రోగామ్ ఆఫీసర్ శ్రీనివాసరావు సందర్శించారు.మాతాశిశు మరణాలు లేకుండా చూడాలన్నారు. జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్రకుమార్, డీపీహెచ్ఎన్ఓ ఇంచార్జి ప్రకాష్, వైద్యాధికారి దివాకర్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్‌పై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 4: రైతులంతా తప్పనిసరిగా ఈ క్రాప్ బుక్ చేసుకోవాలని వ్యవసాయాధికారిణి భారతి సూచించారు. కనమనంబేడు, పెద్దపాలేడు, చిన్నపాలేడు గ్రామాల్లో పంట పొలాల దగ్గరకు వెళ్లి గురువారం ఈ క్రాప్ బుకింగ్‌పై రైతులకు ఆమె అవగాహన కల్పించారు.

ప్రభుత్వానికి గుణపాఠం నేర్పుతాం

కేవీబీపురం, జనవరి 4 : వైసీపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం నేర్పుతామని అంగన్‌వాడీ నాయకురాలు రాజేశ్వరి హెచ్చరించారు. 24రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

అయోధ్య అక్షింతలకు విశేష పూజలు



శ్రీకాళహస్తి, జనవరి 4: అయోధ్య శ్రీరామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలకు పూజలు నిర్వహించారు. పట్టణంలోని కొత్తపేట రామ మందిరం గురువారం ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమం రామనామ సంకీర్తనలతో మార్మోగింది. అక్షింతల కలశాలను భక్తిశ్రద్ధలతో శిరస్సుపై దాల్చి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు.గరికపాటి రమేష్, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వరదయ్యపాళెం, జనవరి 4: వరదయ్యపాళెం ప్రభుత్వ కళాశాలలో గురువారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ఆధ్వర్యంలో అవినీతి రహిత భారతదేశం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు, సీసీఆర్ ప్రతినిధి గుత్తి త్యాగరాజు పాల్గొన్నారు.

స్థానిక యువతకే శాశ్వత ఉద్యోగాలు కల్పించాలి

వరదయ్యపాళెం, జనవరి 4: స్థానిక యువతకే పరిశ్రమల్లో శాశ్వత ఉద్యోగావకాశాలు కల్పించాలని సత్యవేడు నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ మొరంపల్లి నందిని కోరారు. పెద్దపాండూరు హరిజనవాడ,తడ రోడ్డు, కొరివ చెక్‌పోస్టు ప్రాంతాల్లో ఆమె కరపత్రాలను పంపిణీ చేశారు.

కొనసాగిన దీక్ష

కేవీబీపురం, జనవరి 4 : మండలంలోని రాజులకండ్రిగలో తమ భూములు ఆక్రమించిన అగ్ర కులస్థులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద దళితులు చేపట్టిన రిలే దీక్ష గురువారం కూడా కొనసాగింది. తమకు న్యాయం జరిగే వరకు దీక్ష విరమించబోమని బీఎస్పీ ఉపాధ్యక్షుడు పరుశురాముడు చెప్పారు.ధన, శేఖర్, వెంకటముని, తమాస్, మురగయ్య తదితరులు పాల్గొన్నారు.